సర్వీసు ఫుల్.. చార్జీలు నిల్!

- రూ.872 కోట్లకు చేరిన సర్వీస్ చార్జీల బకాయిలు
- ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా విడుదల చేయని కేంద్రం
- ఆర్థిక సంక్షోభంలో కంటోన్మెంట్ బోర్డు
- ఎలివేటెడ్ కారిడార్ సొమ్మూ కేంద్రం ఖాతాలోకే..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పాలనలో పూర్తి పెత్తనం ప్రదర్శించే ఆర్మీ, తాను చెల్లించాల్సిన సర్వీసు చార్జీల విషయం మాత్రం పక్కన పెట్టేస్తోంది. ప్రతీయేటా డిమాండ్, కేటాయింపులకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో నానాటికీ బకాయిల భారం పెరిగిపోతోంది. తాజాగా కంటోన్మెంట్‌కు ఆర్మీ చెల్లించాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు ఏకంగా రూ.872 కోట్ల మార్కును దాటాయి. పదేళ్లలో తొలిసారిగా కేంద్రం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఒక్క రూపాయి కూడా సర్వీసు చార్జీ చెల్లించలేదు. ఇదిలా ఉండగా ఇటీవల కేంద్రం ఆమోదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో కంటోన్మెంట్‌కు సంబంధించిన స్థలాల పరిహారం సుమారు రూ. 320 కోట్లు సైతం తన ఖాతాలోకి మళ్లించుకోవడంతో బోర్డు పెద్దలు లబోదిబోమంటున్నారు. అసలే ఆర్థిక పరిస్థితి ఆందోళనకర స్థాయిలో కంటోన్మెంట్‌కు కనీసం నష్టపరిహారం తమకే ఇవ్వాలంటూ మరోసారి విజ్ఞప్తి చేయడం గమనార్హం.

ఈ ఏడాది డిమాండ్ రూ.120 కోట్లు

నలభై ఏళ్ల క్రితం (1983–84) ఆర్మీ సర్వీసు చార్జీలు రూ.74.45 లక్షలు ఉండగా, ఆ ఏడాది ఎలాంటి చార్జీలు చెల్లించలేదు. నాటి నుంచి ప్రతీయేటా డిమాండ్ పెరుగుతున్నప్పటికీ అందులో సగటున పదిశాతం కూడా చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో 1995–96 నాటికి సర్వీసు చార్జీలు రూ.14.7 కోట్లకు చేరడంతో ఆ ఏడాది కేంద్రం పూర్తి స్థాయిలో చెల్లించడంతో బకాయిలు రద్దయ్యాయి. అప్పటి నుంచి నాలుగేళ్ల పాటు ఎప్పటికప్పుడు సర్వీసు చార్జీలు చెల్లించారు. తిరిగి 199–2000 నుంచి మళ్లీ చెల్లింపుల్లో కోతలు విధించడంతో 2013–14 నాటికి బకాయిల భారం రూ.317 కోట్లకు చేరింది.

మల్లారెడ్డి చొరవతో...

2014–19 కాలంలో అప్పటి ఎంపీ మల్లారెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర రక్షణ శాఖ అధికారులకు పదే పదే విజ్ఞప్తులు చేయడంతో ఈ మధ్యకాలంలో గరిష్ఠంగా రూ.95.52 కోట్లు వసూలయ్యాయి. 2015–16లో అత్యధికంగా రూ.31 కోట్లు విడుదలయ్యాయి. 2019 నుంచి నేటి వరకు కేవలం రూ.36.7 కోట్లు మాత్రమే విడుదల కాగా, ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి నిధులు అందలేదు. బకాయిలకు తోడు కేవలం ఈ ఏడాది డిమాండే రూ.120 కోట్లకు చేరింది.

పరిహారమూ కేంద్రం ఖాతాలోకే..

ఎలివేఏటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రక్షణ పరిధిలోని ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కంటోన్మెంట్ తదితర కేంద్ర సంస్థలకు చెందిన సుమారు 150 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఇందుకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.1700 కోట్ల పరిహారం కోరుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే భూముల్లో కంటోన్మెంట్‌కు చెందిన 32 ఎకరాల స్థలం కూడా ఉన్నందున, సంబంధిత పరిహారం రూ.320 కోట్లు తమకే ఇవ్వాలంటూ కంటోన్మెంట్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని పెడచెవిన పెట్టిన కేంద్రం మొత్తం పరిహారం సొమ్మును తన ఖాతాలోకి మళ్లించుకోవడం గమనార్హం.

క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం.. ఆదుకోండి!

బోర్డు సమావేశంలో కేంద్రానికి వినతి



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న అధికారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం స్పందించిన తగిన నిధులు సమకూర్చాల్సిన అవసరం ఏర్పడిందని కంటోన్మెంట్ బోర్డు అభిప్రాయపడింది. ఎలివేటెడ్ కారిడార్ కోసం బోర్డు స్థలాల 32 ఎకరాలకు సంబంధించిన పరిహారం రూ.320 కోట్లు తమకే ఇవ్వాలని ముగ్గురు సభ్యులతో కూడిన కంటోన్మెంట్ బోర్డు తీర్మానం చేసింది. అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ నేతృత్వంలో జరిగిన బోర్డు సమావేశంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ మెంబర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీపీటీ బకాయిల్లో రూ.48.53 కోట్లు చెల్లించడంతో కాస్త ఊరట లభించిందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో 32 ఎకరాలు కంటోన్మెంట్ బోర్డుకు చెందినవి ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించిన పరిహారాన్ని తమకే చెల్లించాలని కోరినప్పటికీ కేంద్రం ఒప్పుకోలేదన్నారు. బోర్డు ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆ సొమ్మును తమకే చెల్లిస్తే, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో పరిహారాన్ని కంటోన్మెంట్‌కే చెల్లించే అంశంపై పునరాలోచించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

చర్చించిన అంశాలివే..

- కంటోన్మెంట్‌కు అదనంగా 2 ఎంజీడీ నీటిని విడుదల చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని సీఈఓ తెలిపారు. ఇందుకు కనెక్షన్ చార్జీలు చెల్లించాల్సిందిగా జలమండలి సూచించడంతో ఇప్పటికే రూ.2.5 కోట్లు చెల్లించామన్నారు. కనెక్షన్ చార్జీల నుంచి మినహాయింపులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు.
- కంటోన్మెంట్‌లో నూతనంగా నిర్మించిన మహిళా శక్తి భవన్‌ను ఈ నెల 7న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సీఈఓ తెలిపారు. అదే రోజు దనలక్ష్మీ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కును కూడా ప్రారంభిస్తారు.
- ఈ నెల 12న బొల్లారంలో జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న డయాలసిస్ సెంటర్, రసూల్‌పురాలోని స్ఫూర్తి పాఠశాలలో మొద టి అంతస్తు ప్రారంభోత్సవంతో పాటు, కంటోన్మెంట్ బోర్డు కార్యా లయ విస్తరణ పనులకు శంకుస్థాపన.
- బోర్డు పరిధిలో అమలు చేసేందుకు రూపొందించిన బోర్‌వెల్స్ నియంత్రణ, నిర్వహణ విధి, విధానాల డ్రాఫ్ట్‌కు సంబంధించి దివంగత ఎమ్మెల్యే లాస్య నందితతో పాటు మొత్తం 56 అభ్యంతరాలు వచ్చాయన్నారు. ముఖ్యంగా బోర్‌వెల్స్‌కు మీటర్లతో పాటు, అదనపు నీటిని తోడుకున్నందుకు చార్జీలు వసూలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయన్నారు. బోర్డు సభ్యుడు రామకృష్ణ సూచన మేరకు, కేవలం కమర్షియల్ భవనాలకు సంబంధించిన బోర్లపై చార్జీలు వసూలు చేసేలా సవరించేందుకు తీర్మానించారు.

లాస్యకు నివాళి..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు బోర్డు అధ్యక్షుడు సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్, మెంబర్ రామకృష్ణతో పాటు బోర్డు సమావేశంలో పాల్గొన్న అధికారులు, జర్నలిస్టులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 57, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 23, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 21, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 21, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు జెక్‌కాలనీలో మహిళా దినోత్సవాలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం (నేడు) మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ ఎస్.అన్నపూర్ణ తెలిపారు. కాలనీ రెండో రోడ్డులోని పుట్ట ఎదురుగా గల స్థలంలో ఉదయం 10.30 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు.

విశ్వభారతి పాఠశాలలో సైన్స్ ఫెయిర్

రసూల్‌పురా: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతాయని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం రసూల్‌పురా విశ్వభారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శనను ఆయన ప్రారంభించి విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు.

టెట్ నోటిఫికేషన్‌కు వినతి



ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ రిసర్చ్ స్కాలర్స్ అధ్యక్షులు డాక్టర్ ప్రేమ్‌కుమార్ కోరారు. మంగళవారం రిసర్చ్ స్కాలర్స్ టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టెట్ లేకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తే టీటీసీ, బీఈడీ నిరుద్యోగులు నష్టపోతారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరంగా కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం పీజీరోడ్డులో డిమ్మీపాన్ షాప్ నుంచి జవహర్‌నగర్ వరకు రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో పీజీ రోడ్డులో అనేక అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, కిషోర్, ప్రవీణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలి



దయాకర్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్‌ను తనకు కేటాయించాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధనకై తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగాల భర్తీ కోసం పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంతోనూ పోరాడినా, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించగా అవకాశం ఇవ్వకున్నా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేశానని బీసీలు అందులోనూ గౌడ్స్ అధిక జనాభా గల భువనగిరి ఎంపీ టికెట్ తనకు కేటాయిస్తే ఓయూ విజయం సాధిస్తానని ఇతర వర్గాలకు కేటాయిస్తే ఓటమి తప్పదన్నారు.

సాయన్న సేవలు మరువలేనివి



సాయన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న జయంతి కార్యక్రమాలు మంగళవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. రసూల్‌పురా డబుల్‌బెడ్రూమ్ వద్ద సాయన్న విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నియోజకవర్గానికి సాయన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, బాల్‌రాజు, అంజనేయులు, ధన్‌రాజు, షేక్ నయిం, శ్రీనివాస్ ముదిరాజ్, యాదగిరి, సందీప్, గౌస్ పాల్గొన్నారు. అదే విధంగా జేబీఎస్ వద్ద సాయన్న టీమ్ ఆధ్వర్యంలో సాయన్న చిత్రపటానికి టీఎస్. శ్రీనివాస్, సంతోష్ కిరమ్‌కుమార్, శ్రీహరి, తేజ్‌పాల్, నాగరాజు, సదానంద్, గంగారాం, కుమార్ నివాళి అర్పించారు.

కులవృత్తులకు ప్రోత్సాహం: మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రసూల్‌పురా: కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ ధోబీ ఘాట్‌లో రూ.80.14 లక్షల వ్యయంతో నిర్మించిన మోడ్రన్ మెకనైజ్‌డ్ లాండ్రీ యూనిట్, బొల్లారంలో రూ.4.4 లక్షలతో నిర్మించిన జిల్లా విద్యా శిక్షణ కేంద్రం (డైట్) భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కులవృత్తుల వారు అధునాతన సాంకేతికత విధానాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడుతుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు లాస్యనందిత మృతి చెంది నెల రోజులు కూడా కాలేదని ఈ విషయంపై మాట్లాడడం భావ్యం కాదని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీవీ.వెన్నెల, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, ఆవుల బాల్‌రాజ్, అయూబ్‌ఖాన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జయప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు కొత్త సంజీవ రెడ్డి, నరసింహ కన్నన్, గజ్వేల్ భరత్, ముప్పిడి గోపాల్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి కష్టాలు రానివ్వొద్దు



జల మండలి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: వేసవి కాలం ప్రారంభం అవుతున్న క్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశించారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా తీరుతెన్నులను సమీక్షించారు. సికింద్రాబాద్ ప్రాంతానికి ప్రతినిత్యం 25.50 జీఎండీల తాగునీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ ప్రాంతాల్లో 195 పవర్ బోరుబావులు వేయించామని నీటి సమస్యలు, లోప్రెషర్ తదితర సమస్యలున్న ప్రాంతాల్లోని ప్రజలకు ప్రత్యామ్నాయ నీరు అందించడం కోసం పవర్ బోర్‌వెల్‌లను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సమావేశంలో జలమండలి డిప్యూటీ జీఎం వై.కృష్ణ, సెక్షన్ మేనేజర్లు అన్విత్, వరుణ్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



స్థానికులతో మాట్లాడుతున్న సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొంటున్న తాగునీరు, మురుగునీటి సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపుతామని కార్పొరేటర్ సామల హేమ హామీ ఇచ్చారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మురుగునీరు, తాగునీటి సమస్యలతో పాటు విద్యుత్ దీపాల సమస్యలపై స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ దీపాల సమస్యలకు పరిష్కారం చూపాలని, అన్ని ప్రాంతాల్లోని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్ట్రీట్‌లైట్స్ సమన్వయకర్త రవీందర్‌ను కోరారు. అనంతరం మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయానికి వెళ్లిన సామల హేమ జీఎం వినోద్, డీజీఎం కృష్ణతో సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరారు. పైపులైన్‌ల నిర్మాణం పనులు పూర్తి చేయడం ద్వారా వేసవిలో ప్రజల ఇబ్బందులు తీరుతాయని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్పొరేటర్ వెంట రాజసుందర్, పద్మ ఉన్నారు.

తృణముల్ కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ప్రవేశ ద్వారం ఎన్‌సీసీ గేటు వద్ద మంగళవారం ఏబీవీపీ నాయకులు తృణముల్ కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ కాళీ ప్రాంతంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మౌనానికి నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేసినట్లు ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. మహిళా సీఎంగా ఉన్న రాష్ట్రంలోనే ఇలాంటి దుర్ఘటనలు జరగడం సిగ్గుచేటని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి జాన్సీ ధ్వజమెత్తారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నైతిక బాధ్యత వహించి సీఎం మమత బెనర్జీ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పృథ్వీతేజ, జీవన్, రాజు, శ్రీధర్, కోటేశ్వర్, వికాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



నియామక పత్రం అందుకుంటున్న రవికుమార్

సికింద్రాబాద్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్‌ను నియమిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు గంజి రాజమౌళిగుప్తా, తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ ప్రకటించారు. ఫెడరేషన్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందుకూరి శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా కల్వ సంతోష్‌గుప్తా, కోషాధికారిగా గుండా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నార్ల నారాయణ, ఉపాధ్యక్షుడిగా నవీన్‌గుప్తా, పీఆర్‌ఓగా గుండా సంతోష్‌ను నియమించారు. వీరితోపాటు సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడిగా నామాలగుండుకు చెందిన వెంకటేశ్వరరావుబాబును నియమించారు.

10న తార్నాక వంజరి సంఘంలో మహిళా సదస్సు

లాలాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న తార్నాకలోని తెలంగాణ వంజరి సంఘంలో 'మహిళా సదస్సు'ను ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మహిళా సదస్సు ప్రారంభమవుతుందని మహిళా సమస్యలపై చర్చలు, ప్రతిభ కల్గిన మహిళలకు సన్మానాలు, ఆటా పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తార్నాకలో ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 10 నిర్వహించనున్న వంజరి మహిళా సదస్సులో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనురాధ, సునీత, సాయి రజిని, విజయలక్ష్మి, గీత, శోభ, దేవిక పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: నిబంధనలకు విరుద్ధంగా పది ప్రవేశాలు చేపడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలు ముగియక ముందే ప్రవేశాలు జరపడం చట్ట విరుద్ధమని కనీస మౌలిక వసతులు లేని హైస్కూల్, ఇంటర్ విద్యా సంస్థల్లో ఇష్టారాజ్యాంగా ప్రవేశాలు కల్పించి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు.

తలసాని వెంకటేశం యాదవ్‌కు నివాళి

పద్మారావునగర్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తలసాని వెంకటేశం యాదవ్ వర్ధంతి సందర్భంగా మోండా మార్కెట్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోండా మార్కెట్‌లో కార్మికులు, వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తలసాని వెంకటేశం తనయులు నర్సింగ్ యాదవ్, శంకర్ యాదవ్, మహేష్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, స్కైలాబ్ యాదవ్‌లతో పాటు కోత్‌మీర్ మధు, కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పూలహరి, రాములు, జయరాజ్ పాల్గొన్నారు.

నేడు మైత్రీవనం వద్ద ధర్నా

సనత్‌నగర్: ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అమీర్‌పేట మైత్రీవనం వద్ద ధర్నా నిర్వహించనున్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, తలసాని సాయికిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు ధర్నా చేపట్టనున్నట్లు ఆ పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

అన్నదానం



సనత్‌నగర్: బీకేగూడ శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో అన్నదానం చేశారు. సుజాత నరసింహగౌడ్, సుశీల దాతలుగా ముందుకొచ్చి 100 మందికి భోజనం వడ్డించారు. సాయిభక్తులు హుస్సేన్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ పార్థసారథి, విఠల్‌రెడ్డి, రామమూర్తి, కృష్ణారెడ్డి, మాణిక్‌రావు, పాటిల్, ప్రసాద్, అరవింద్‌గౌడ్ సేవలు అందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్–మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిగా మృతుడి వివరాలు లభించలేదు. మృతుడి వద్ద లభించిన సికింద్రాబాద్–నాందేడ్ రైలు టికెట్ ఆధారంగా సదరు వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు.

రేపు 'చలో ఉస్మానియా'

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని 7న చలో ఉస్మానియా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డా.పరుశురామ్ పేర్కొన్నారు. క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రొ.హరగోపాల్, ప్రొ.కోదండరామ్, ప్రొ.పాపిరెడ్డి పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

నేడు తార్నాకలో చలివేంద్రాల ప్రారంభం

లాలాపేట: వేసవిని దృష్టిలో పెట్టుకుని పాదచారుల దాహార్తిని తీర్చడానికి తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సోషల్ వర్కర్ పి. మధుబాబు తెలిపారు. తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో, శాంతినగర్ చౌరస్తాలో, లాలాపేట రామ్ థియేటర్ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను నేడు ప్రారంభిస్తామన్నారు.


ఎస్పీ కాలేజీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హేమలత

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత ప్రారంభించారు. కళాశాలలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆయా విభాగాలకు చెందిన అధ్యాపక, ఇతరత్రా సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. రక్తదానం ఎంతో గొప్పదన్నారు. విద్యతో పాటు విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమర్‌నాథ్ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. బాబు, బి. రాజశేఖర్, తెలుగు విభాగం అధ్యక్షులు బి. రమేష్, రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ఆర్యసమాజ నిర్వాహకులు మంగళవారం ఆర్యసమాజ వ్యవస్థాపకులు దయానంద సరస్వతి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆర్యసమాజం నుంచి సమాజం ప్రతినిధులు, వైదిక విద్యాలయం విద్యార్థులు సీతాఫల్‌మండి పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. వేద వాహనాన్ని ఏర్పాటు చేసి యజ్ఞం విశిష్టతను వివరించారు. ప్రధాన వక్తగా హాజరైన వేద పండితుడు వేదమిత్ర, ఆచార్య డాక్టర్ విశ్వశ్రవలు భక్తులకు దయానంద సరస్వతి జీవిత ప్రాముఖ్యతను తెలిపారు. ఆర్యసమాజం సీతాఫల్‌మండి అధ్యక్ష, కార్యదర్శులు బి.గంగాధర్‌ఆర్య, జి.మల్లయ్య నేతృత్వంలో జరిగిన వేడుకల్లో పెద్దసంఖ్యలో సీతాఫల్‌మండి ప్రజలు హాజరయ్యారు.